క్లుప్తంగా

అథ్లెటిక్స్‌లో రైజ్ విద్యార్థి ప్రతిభ



మెడల్, ప్రశంసాపత్రం అందుకుంటున్న సుబ్రహ్మణ్యం

ఒంగోలు: కాకినాడ జేఎన్‌టీయూ నిర్వహించిన విశ్వవిద్యాలయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రైజ్ కృష్ణసాయి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి ఎ.సుబ్రహ్మణ్యం డిస్కస్‌త్రో, షాట్‌పుట్ విభాగాల్లో తృతీయ స్థానంలో నిలిచాడు. మెకానికల్ విభాగంలో నాలుగవ సంవత్సరం చదువుతున్న ఈ విద్యార్థిని శనివారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, కాలేజీ డైరెక్టర్ ఏవీ భాస్కరరావు అభినందించారు. పోటీలు ఇటీవల సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో జరిగాయి.

చిత్రలేఖనంలో అశ్విని జిల్లా టాపర్



కలెక్టర్ నుంచి ప్రశంసపత్రం అందుకుంటున్న అశ్విని

కురిచేడు: మండలంలోని బోదనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వేమ అశ్విని చిత్రలేఖనంలో జిల్లా టాపర్‌గా నిలిచింది. పాఠశాల ఎస్ఏ ఉపాధ్యాయులు సీహెచ్ఎన్ఆర్‌వీ ప్రసాదరావు మార్గదర్శకత్వంలో విద్యార్థిని ఇన్నోవేటివ్ ఇండియా వీరగాథ విభాగంలో చిత్రలేఖనం వేసింది. ఆ చిత్రలేఖనం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా శుక్రవారం ఒంగోలులో ప్రశంసపత్రం అందుకుంది. విద్యార్థినిని హెచ్ఎం పాపారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

కొమరోలు: గ్రామాల్లో ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం డిజిటల్ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రవినాయక్ తెలిపారు. కొమరోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఇడమకల్లులో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుభ్రపరిచారు. రవినాయక్ ప్రజలకు అవగాహన ఏర్పాటు చేసి గ్రామాన్ని ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు అబ్బూరి అల్లూరయ్య పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో చోరీ

దర్శి: మండలంలోని వెంకటాచలంపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రాత్రి దొంగలు పడి టీవీ, కంప్యూటర్, కీ ప్యాడ్, వైఫై బాక్స్‌లు దొంగిలిచుకెళ్లారు. వీఏఏ రమావత్ గంగా సోమ్లానాయక్ తెలిపిన వివరాల మేరకు తోటి ఉద్యోగి శివకుమార్‌రెడ్డి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం పూర్తయిన తర్వాత తాళం వేసి ఇద్దరూ ఇంటికి వెళ్లారు. శనివారం వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూసే సరికి పైవస్తువులు కనిపించలేదు. దొంగలు పడ్డారని తెలుసుకున్న వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్సై రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేరుగును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



చంద్రపాడులో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- చంద్రపాడులో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: రానున్న ఎన్నికల్లో సంతనూతలపాడు అసెంబ్లీ ఎమ్మెల్యేగా మేరుగు నాగార్జునను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున ఎన్నికల ప్రచారాన్ని శనివారం రాత్రి చీమకుర్తి మండలంలోని చంద్రపాడు, పులివారిపాలెంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి ప్రారంభించారు. మేరుగు నాగార్జునను గ్రామస్తులకు పరిచయం చేశారు. గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని ప్రధాన నాయకులను కలిసి పార్టీకి అండగా నిలవాలని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని, దానికి గాను సంతనూతలపాడు అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేస్తున్న మేరుగు నాగార్జునను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన వీధుల్లో తిరిగి ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, క్రిష్టిపాటి శేఖరరెడ్డి, జ్యేష్ఠ శ్రీనివాసరావు, పమిడి వెంకటేశ్వర్లు, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, యర్రగుంట్ల వసంతరావు, యర్రగుంట్ల మోహన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజింగ్ ఉపాధి నిషేధించాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: మాన్యువల్ స్కావెంజింగ్ ఉపాధిని పూర్తిగా నిషేధించాలని జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు సూచించారు. శనివారం ప్రకాశం భవనంలో మాన్యువల్ స్కావెంజర్ ఉపాధి నిషేధం, వారి పునరావాస చట్టం-2013పై సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు, ఎక్స్ అఫిషియోలతో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో గత సమావేశానికి సంబంధించిన తీర్మానాలపై సమీక్షించి పరిష్కరించారు. సమావేశంలో సామాజిక కార్యకర్త డాక్టర్ కిషోర్‌కుమార్ మందా మాట్లాడుతూ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని, ఫిబ్రవరి 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వాటిలో మాన్యువల్ స్కావెంజర్స్, సఫాయి కర్మచారుల పిల్లలకు 3 శాతం రిజర్వేషన్ ఉందని చెప్పారు. ఈ అంశాన్ని అధికారుల ద్వారా మాన్యువల్ స్కావెంజర్స్, సఫాయి కర్మచారులకు తెలియజేయాలని కోరారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ ఆమేరకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సోషల్ వర్కర్ మిట్నాసల బెంజిమెన్, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, హౌసింగ్ పీడీ పేరయ్య, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, రిమ్స్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు



రాష్ట్రస్థాయి పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీల విజేతలు

ఒంగోలు: హైదరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ముగిశాయి. మొత్తం 32 టీములు పోటీపడగా వారిలో మొదటి బహుమతిని గుంటూరు జిల్లాకు చెందిన చంద్రగోపి-కిరణ్ జోడీ గెలుచుకున్నారు. రెండో బహుమతిని విశాఖపట్నం జిల్లా నుంచి సాయికిరణ్-గుణ శ్రీకర్ గెలుచుకున్నారు. 3వ బహుమతిని వైఎస్సార్ కడప జిల్లా నుంచి ప్రణీతరాజు-హర్ష గెలుచుకున్నారు. 4వ బహుమతిని గుంటూరు జిల్లా నుంచి విజయసాయిరెడ్డి-సైదా కైవసం చేసుకున్నారు. బ్యాడ్మింటన్ స్టార్ గుమ్మడి పవన్ కుమార్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ పోటీల్లో బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును విశాఖ జిల్లా నుంచి వేణుపార్థివ్ అందుకున్నారు. మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండో బహుమతిగా రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు, బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు కింద రూ.5 వేలు చొప్పున హైదరీ క్లబ్ కార్యదర్శి డాక్టర్ జి.రాఘవ, ఉపాధ్యక్షుడు ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఈదుపల్లి గురునాథం, కోశాధికారి ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు కొణిజేటి సుబ్బయ్య, మస్తాన్ చేతులమీదుగా నగదుతోపాటు షీల్డులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హిల్ సిటీ మేనేజ్‌మెంట్ బొద్దులూరి ఆంజనేయులు, ధాత్రి టౌన్ షిప్ గిరిధర్, పీసీపీఎల్ బ్లాస్టర్స్ వర్సెస్ బ్రహ్మయ్య అండ్ కో రామ్ స్పోర్ట్స్, ఆర్‌కె కమ్యూనికేషన్స్ రాంబాబు టోర్నమెంట్‌కు సహకరించారు.



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని, మంత్రి మేరుగు, జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి, దర్శి ఇన్‌ఛార్జి శివప్రసాదరెడ్డి



డ్వాక్రా మహిళలతోకలిసి కోలాటం వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం నూతన భవనాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోలాటం ఆడారు.
– చీమకుర్తి



ప్రకాశం పంతులు విగ్రహం వద్ద ఫౌంటేషన్‌ను ప్రారంభిస్తున్న బాలినేని

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు మెట్రో: బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక లాయర్‌పేట రైతు బజార్ దగ్గర ప్రకాశం పంతులు విగ్రహం వద్ద వాటర్ ఫౌంటేషన్‌ను శనివారం రాత్రి బాలినేని ప్రారంభించారు. అనంతరం బాలినేని మాట్లాడుతూ అర్హులైన పేద బ్రాహ్మణులకు ఇళ్ల పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహాన్ని స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర త్వరలో నెలకొల్పుతామని తెలిపారు. నగరంలోని మంగమూరు రోడ్డుని ప్రకాశం పంతులు రోడ్డుగా మారుస్తున్నానని తెలిపారు. స్థానిక తోపులో బడి దగ్గర బ్రాహ్మణుల సహాయార్థం అపరకర్మలకు స్థలం మంజూరు చేశానని తెలిపారు. ఒంగోలు అభివృద్ధికి నా వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. త్వరలో ఒంగోలు నగరానికి ప్రతిరోజు మంచినీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, 35వ డివిజన్ కార్పొరేటర్ శాండిల్య, నగర కమిషనర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ (బుజ్జి), కార్పొరేటర్లు, ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు మద్దులూరి హరి, మైనంపాటి సాయికుమార్, గడియారం సుబ్బయ్యశర్మ, జ్వాలాపతి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: విభజన హామీలను అమలు చేయకుండా, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బీజేపీని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో శనివారం జరిగిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఓటమి ద్వారానే దేశంలో ప్రజాస్వామ్యం పరిరక్షణ, భారత రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హక్కుల పరిరక్షణ సాధ్యమౌతుందన్నారు. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు మోడీ రాముడి అవతారం అంటూ బీజేపీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయని, మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ నిస్సిగ్గుగా దేవుడిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి ఏం ప్రయోజనం చేకూర్చిందని టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీకి మద్దతు ఇస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి వ్యతిరేకంగా సీపీఐ నిత్యం పోరాడుతుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ప్రజలు సమాయత్తం కావాలని కోరారు. సమావేశానికి వడ్డే హనుమారెడ్డి అధ్యక్షత వహించగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఆర్.వెంకటరావు, ఎస్.రావమ్మ, సయ్యద్ యాసిన్, కృష్ణగౌడ్, ఎస్డీ మౌలాలి, అందె నాసరయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు గ్రంథాలయ సభ్యత్వం



గ్రంథాలయంలో సభ్యత్వం ఇస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: ప్రతి విద్యార్థి గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం అవుట్‌సోర్సింగ్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుదర్శి అనిల్ బాబు ఆర్థిక సహాయంతో ఒంగోలు నగరంలోని పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థినులకు గ్రంథాలయ సభ్యత్వం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. గ్రంథాలయంలో పుస్తకాలను చదవడం వల్ల మంచి జ్ఞానంతో పాటుగా వ్యక్తిత్వం అలవడతుందన్నారు. గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవడం వల్ల మనకు కావాల్సిన పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకోవచ్చని చెప్పారు. గ్రంథాలయాలను విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తన కూతురు ఖుషి పుట్టిన రోజును పురస్కరించుకొని పదిమంది పిల్లలకు గ్రంథాలయ సభ్యత్వం ఇప్పించడం సంతృప్తి కలిగించిందని అనీల్‌కుమార్ చెప్పారు. అనీల్‌కుమార్ నిర్ణయం అనేక మందికి స్ఫూర్తి కావాలని ఉప గ్రంథాలయ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి చెప్పారు. అనీల్‌కు ఆమె అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు చిన్నారులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

మార్కాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పతకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు కోరారు. శనివారం పట్టణంలోని నాయుడు బజారులో వికసిత భారత్ సంకల్ప యాత్ర సభను నిర్వహించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్, హౌసింగ్ ఏఈ చందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం



మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి. కేశవరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఏకేయూ డీన్‌కు జాతీయ సమైక్యతా పురస్కారం



డి.వెంకటేశ్వరరెడ్డి

ఒంగోలు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ లయన్స్ ఇంటర్నేషనల్, సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థలు సంయుక్తంగా స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డీన్ డి.వెంకటేశ్వరరెడ్డిని జాతీయ సమైక్యతా పురస్కారానికి ఎంపిక చేశారు. ఈయన ఆదివారం సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు అందుకోనున్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, దేశభక్త కొండా వెంకటప్పయ్య, ప్రకాశం జిల్లా జాతీయోద్యమ త్యాగమూర్తులు వంటి రచనలు చేసినందుకుగాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈయన గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వంచే విశ్వవిద్యాలయాల స్థాయిలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. మొత్తంగా 35కిపైగా జాతీయ, అంతర్జాతీయ వ్యాసాల ప్రచురణతోపాటు 7 జాతీయ సదస్సులు నిర్వహించారు. డిగ్రీ, పీజీ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం, వివిధ విశ్వవిద్యాలయాలు రూపొందించిన పలు పాఠ్యగ్రంథాలకు సంపాదకత్వమూ వహించారు. పురస్కారానికి ఎంపికైన వెంకటేశ్వరరెడ్డికి ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి, యూనివర్శిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్ తదితరులు అభినందనలు తెలిపారు.

జేవీవీ క్యాలెండర్ ఆవిష్కరణ



జేవీవీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ బీ.జవహర్

చీమకుర్తి: జనవిజ్ఞాన వేదిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బీ.జవహర్ చేతుల మీదుగా శనివారం చీమకుర్తిలోని జవహర్ ఆస్పత్రి ప్రాంగణంలో ఆవిష్కరించారు. జేవీవీ తరఫున మూఢనమ్మకాల తొలగింపునకు చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో జేవీవీ మండల నాయకులు నల్లూరి వెంకటేశ్వరరావు, బీ.ఆంజనేయులు, చలువాది రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

ఆసరా సభ విజయవంతం చేయండి

దర్శి: వైఎస్సార్ ఆసరా సభ విజయవంతం చేయాలని వైఎస్సార్ కేపీ ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి, ఎంపీడీఓ శంకరరావు కోరారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో ఈ నెల 30వ తేదీన జరగనున్న వైఎస్సార్ ఆసరా సభ ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. వసుంధరాదేవి, శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డ్వాక్రా రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఇప్పటి వరకు రూ.21 కోట్ల 6 లక్షల రూపాయలు మహిళలకు రుణమాఫీ నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. నాలుగో విడతగా 7 కోట్ల 22 లక్షల రూపాయలు 1002 సంఘాలకు జమ చేస్తామని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి హాజరవుతారన్నారు. ఏర్పాట్ల పరిశీలనలో వైస్ ఎంపీపీలు బంకా రమణమ్మ, నాగిరెడ్డి, వేముల పద్మా జానకిరామయ్య, మండల మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాస రెడ్డి, వేముల శ్రీను, మేకల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్‌లో డ్రాపౌట్స్ లేకుండా చేయడమే లక్ష్యం

- గుంటూరు ఆర్‌జేడీ సుబ్బారావు

కంభం: పాఠశాల స్థాయిలోనేగాక ఇంటర్మీడియెట్ దశలో డ్రాపౌట్స్ లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఇంటర్మీడియెట్ విద్యామండలి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వీవీ సుబ్బారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల 54వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం విరివిగా నిధులు వెచ్చిస్తోందని, ఆంగ్ల మాధ్యమంతో పాటు స్కిల్ హబ్ కేంద్రాల ద్వారా త్వరితగతిన ఉపాధి పొందగలిగే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం విజయీభవ పేరుతో తప్పనిసరిగా ఉత్తీర్ణులయ్యేందుకు 50 రోజుల కార్యాచరణను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతి విద్యార్థి దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ విద్య ద్వారా పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇంటర్ బోర్డు ఆర్ఐఓ, కళాశాల ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్ మాట్లాడుతూ 2023-24లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరిగిందన్నారు. ఇంకా ప్రవేశాలు పెరిగేందుకు రానున్న విద్యా సంవత్సరానికి కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. నాడు - నేడు ద్వారా మౌలిక వసతులు, బోధనా వసతులు పెరిగాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎంఈఓ మాల్యాద్రి, పీడీ మురళి పాల్గొన్నారు.